# శాంతిహీనులు

"ఒక స్త్రీ ఒక పురుషుడికి ప్రేమ లేఖ రాయవచ్చును. అందులో ఎవ్వరికీ అభ్యంతరం వుండక్కర్లేదు. ఆ స్త్రీ వున్నతురాలా? ఆ పురుషుడు సత్యవంతుడా? ఆ ప్రేమ శ్వాశతమా? అని ఇతరు లెవ్వరూ తర్జన భర్జన పడక్కర్లేదు—వాళ్ళిద్దరూ తప్ప.

కానీ ఆ ప్రేమ లేఖలు నడిపేది ఆమె కొడుకే అయితే? ఆ కొడుకు పదేళ్ళ పసివాడు అయితే?

ఎందుకో ఆ కృష్ణని చూసినప్పుడు నా మనసు చాలా కలతపడుతోంది.... నేనే చాదస్తుణ్ణేమో?.... తల్లి చెప్పిన పని ఏదైతేనేం?.... తప్పొప్పుల సంగతి పిల్లల కెందుకు?.... తప్పని కాదు. అన్నీ తప్పులే కానక్కర్లేదు. ఆ వుత్తరం తెచ్చి కృష్ణ, ప్రసాద్‌కి ఎంత సిగ్గు పడుతూ ఇస్తాడో.. ప్రసాద్ ఆ అబ్బాయిని ఎంత నిర్లక్ష్యంగా చూస్తాడో.... ఒక్కసారి చూస్తే ........వొక్కసా రేమిటి?.... అనేక సార్లు చూస్తున్నాను. ఏమీ చెయ్యలేం. ప్రపంచంలో ఎన్నో నీచాలు – మోసాలు – అసహ్యాలు – వింటూ చూస్తూ భరిస్తూ ఏమీ చెయ్యలేం."

ఆ నాలుగు మాటలూ అరగంటసేపు డైరీలో రాసి పెన్ను చేతిలో పట్టుకుని ఆలోచనల్లో మునిగి కూర్చున్నాడు వేణుగోపాల్.

అతని మనసంతా ఆర్ద్రతతో స్పందిస్తోంది. కొన్నాళ్ళనించీ అతని డైరీ పేజీల్లో కృష్ణే ఎక్కువ చోటు చేసుకుంటున్నాడు.

ఆఅబ్బాయి ఆరో క్లాసు చదువుతున్నాడు. సన్నగా పొడుగ్గా కొంచెం తెల్లగా....మంచి వొత్తుజుట్టు, తెలివైన కళ్ళు, ఎప్పుడూ వుత్సాహంగా ఆడుతూ కనిపిస్తాడు. అతని కిద్దరు చెల్లెళ్ళు. వాళ్ళు అప్పుడప్పుడూ ప్రసాద్ దగ్గరికి వొస్తూ వుంటారు. ప్రసాద్ ఆ పిల్లలకి ఎంతో జాలిపడి దయగా ఇచ్చినట్టు డబ్బులిస్తాడు. ఐస్ ఫ్రూట్లవీ కొనిపెడతాడు. ఆ పిల్లలు ప్రసాద్‌ని "మామయ్యగారూ!" అని పిలుస్తారు.

ఆమె పేరు పద్మావతి అని ప్రసాద్ చెప్పాడు.

"పద్మావతి మాకు దూరపు చుట్టం. వరసకి అక్క అవుతుంది." అన్నా డెప్పుడో-ఆమెని అలాగే పిలుస్తాడతను. వాళ్ళింటికి రాకలూ పోకలూ అప్పుడప్పుడూ వాళ్ళింట్లో కాఫీలూ అన్నీ తెలుసు వేణుకి. పద్మావతి భర్తకి ఆ మధ్య ఏదో జబ్బుచేస్తే ప్రసాద్ ఆస్పత్రి పనుల్లో చాలా సహాయంగా తిరిగాడు. డబ్బుకూడా సర్దుబాటు చేశాడు. అతని వుపకార గుణం చూస్తే వేణుకి చాలా గౌరవం కలిగింది.

నాలుగు రోజుల కిందట-వాళ్ళిద్దరూ రిక్షాలో కనబడితే చాలా ఆశ్చర్యపడ్డాడు వేణు. అంత దగ్గర బంధువులా అని.

ప్రసాద్ రిక్షా దిగి గబగబా వేణు దగ్గిరికి వొచ్చి-"అక్క ఏదో కొనుక్కుంటానంటే తీసుకొచ్చాను. డబ్బు సరిపోయేలా లేదు. ఏమన్నా వుంటే చూడవోయ్" అన్నాడు.

వేణు తన దగ్గిర వున్నమటుకు ఇచ్చాడు. ఇతర్ల గురించి ఎక్కువ ఆలోచించే నైజం కాదు అతనిది.

కానీ—నాలుగు రోజుల క్రిందట అనుకోని విధంగా ఏమీ ఆలోచించకుండానే చాలా స్పష్టంగా తెలిసింది అసలు విషయం.

వేణుగోపాల్ వొక ఫ్రెండ్ దగ్గిరికి బయల్దేరుతూ రాత్రికి రానని చెప్పి వెళ్ళాడు. అక్కడ అతను దొరక్క రెండోఆట చూసి వొంటిగంట ప్రాంతంలో రూమ్ కొచ్చాడు. లోపల్నుంచి మాటలు వినపడి సంగతి తెలిసి నిర్ఘాంతపోయాడు. వాళ్ళనేదో నమ్మించి మోసంచేసినట్టూ— హఠాత్తుగా దాడిచేసి వాళ్ళ రహస్యం బట్టబయలు చేసినట్టూ—సిగ్గుపడిపోయాడు.

భుజంనిండా చెంగు కప్పుకుని తల వొంచుకుని తడబడే నడకతో వెళ్ళిపోయిం దామె. వరండా చివరికిపోయి నించున్న వేణు అపరాధిలాగా లోపలి కెళ్ళాడు.

ప్రసాద్ అద్దంవేపు తిరిగి తల దువ్వుకుంటున్నాడు. ఇద్దరి మధ్యా వొక్కమాట కూడా జరగలేదు. లైటార్పి పడుకున్నారు.

వేణుగోపాల్ తనకి ఊహ తెలిసి నప్పట్నుంచీ 'తప్పు' 'అవినీతి' అనుకునే స్త్రీ పురుష సంబంధాలు అనేకం చూస్తూనేవున్నాడు. మనుషులు

లోకనీతులకి ఎంత విలువ ఇస్తారో.... ఈ అవినీతి సంబంధాలకి అంత లొంగిపోతారు. సంఘానికి పవిత్రతే గొప్ప ఆదర్శం. మనుష లందరికీ మర్యాదస్తులుగా కనపడాలనే పట్టుదల అయినప్పటికీ ఈ మనుష్యుల మధ్యే ఎన్నెన్నో తప్పులూ—అపరాధాలూ—రహస్యాలూ జరుగుతోనే వుంటాయి. అందుకే వేణుగోపాల్‌కి ఏ ఇద్దరు స్త్రీ పురుష సంబంధాలలోనూ అవినీతి కనపడదు. అలాంటిది విన్నప్పుడు — 'ఇది జీవితం. వాస్తవం అంతే' ననిపిస్తుంది.

కాని— ఇక్కడ ఈ ఇద్దరి మధ్యా ఆ చిన్న అమాయకుడు.... అతను ఉత్తరం దాచిన జేబు గట్టిగా పట్టుకుని చుట్టూ మనుషుల్ని శంకించి భయంగా చూడటం కొత్తగా నేర్చుకుంటూ—ప్రసాద్ కోసం రహస్యంగా వెదికి—ఎంతో వినయం నటిస్తూ చటుక్కున ఆ ఉత్తరం యిచ్చే తీరు చూస్తే....

ఆ వొక్క దృశ్యమూ అతన్ని వెన్నాడి మనసంతా దిగులు పరుస్తోంది. అతను ప్రసాద్‌తో ఏడాదిపైగా కలిసివుంటోన్నా ఇద్దరిమధ్యా ఎక్కువ చనువు లేదు. ఇతర్ల స్వంత విషయాలు తనకి అనవసరమేమో అనిపిస్తోంది....ఆమె పరిస్థితి ఏమిటో? ఆమె సమస్య ఏమిటో? ఆమె కింకో మార్గం లేదేమో! ఆ అబ్బాయి గురించి అయినా ఇంత బాధ ఎందుకు తనకి? కన్నతల్లి కన్నా ఆత్మీయుడా తను....చాలా సిగ్గుపడ్డాడా రోజు.

తెల్లారిం తర్వాత ఇద్దరూ చాలా మామూలుగా ఏమీ జరగనట్టు ప్రవర్తించారు.

కానీ....మళ్ళీ సాయంత్రం—వీధిలో పిల్లలమధ్య ఆడుకుంటోన్న కృష్ణని ప్రసాద్ సైగచేసి పిలుస్తోంటే వేణుగోపాల్‌కి చాలా కోపం వొచ్చింది—"ఆ వుత్తరం ఇలాతే. నేను పట్టుకెళతాను. ఆ అబ్బాయిని ఆడుకోనియ్యి." అందా మనుకున్నాడు.

కృష్ణ ఆటలో లీనమై వెంటనే రాలేదని ప్రసాద్‌కి కోపంవొచ్చి ఆజ్ఞాపిస్తున్నట్టు మళ్ళీ మళ్ళీ పిల్చాడు. తప్పనిసరై కృష్ణ ఆట మానుకుని భయపడుతూ వొచ్చినిలబడ్డాడు. "పిలుస్తోంటే వినిపించుకోవేం?" అని విసు

క్కని ...అతని జేబులో కవరుపెట్టి "జాగ్రత్త. డబ్బుంది. గంతులేచి పారేసేవు. వెళ్ళి మీ అమ్మకియ్యి" అని అతన్ని పంపించేసి, తనుగూడా బయటికి వెళ్ళిపోయాడు. విన్నటి వరకూ అతను వేణు ఎదట ఇంత స్పష్టంగా ప్రవర్తించలేదు. ఇవ్వాళ ఆ దాపరికం కూడా లేదు.

ఎక్కువ రోజులు ఇలా జరిగితే చిన్నపిల్లల ప్రవర్తన తప్పుదారి పట్టదా! ప్రసాద్‌కి ఇంత చిన్న విషయం ఎందుకు తెలీదు?

....వేణుగోపాల్ డైరీ మూసి లేచి వరండాలోకి రాబోతోంటే ప్రసాద్ వొచ్చాడు. ఇద్దరూ క్యారియర్ విప్పుకుని అన్నం తిన్నారు. ప్రసాద్ తను చూసి వొచ్చిన సినిమా కబుర్లు వెటకారంగా విమర్శిస్తూ చెప్పి నవ్వించాడు. పదకొండు దాటింది. ఇద్దరూ పడుకున్నారు. చాలా నిశ్శబ్దం, చాలా సేపటికి....

"నిద్రపోతున్నావా ప్రసాద్!" అన్నాడు నెమ్మదిగా వేణుగోపాల్.

"లేదు, రావటం లేదు నిద్ర. సినిమాలో పడుకున్నాను. అందుకేమో....ఏం? ఎందుకూ? నీకూ నిద్రపట్టటం లేదా?"

"అసలలాంటి సినిమా లెందుకు చూస్తావు?"

"ఇంక మానెయ్యాలోయ్ రేపట్నించి."

"అన్నీ వుత్త కబుర్లే. నువ్వు మొన్నేమన్నావు?"

ప్రసాద్ తప్పు వొప్పుకున్నట్టు మాట్లాడ లేదు. కొంత సేపటికి....

"ప్రసాద్! నువ్వేమీ అనుకోనంటే నిన్నో సంగతి అడగనా!" చాలా చనువు వ్యక్తపరుస్తూ అడిగాడు వేణుగోపాల్.

ప్రసాద్ కొంచెం నవ్వి– "నువ్వేం అడుగుతావో తెలుసు నాకు. పద్మావతి సంగతేగా?" అతని నిర్లక్ష్యానికి వేణు తడబడ్డాడు.

"అబ్బే! అదికాదు అసలు .... నేను...."

"ఎందుకంత మొహమాటపడతావు. నా కర్థమైందిలే. తప్పు అని చివాట్లు పెడదామనుకుంటున్నావు. అంతేగా?"

"భలేవాడివే? నేను నిన్ను చివాట్లు పెట్టటం ఏమిటి? నాకు తప్పయితే నీకు తప్పవుతుందా?"

"అందరికి తప్పేగా అది?" అంటూ లేచి సిగరెట్ వెలిగించుకుని మళ్ళీ మంచంమీద కూర్చున్నాడు—"నువ్వెప్పుడో అడుగుతావని నేనూ ఎదురు చూస్తున్నాను. కానియ్యి మరీ" అన్నాడు నవ్వుతూ.

"అదికాదు ప్రసాద్! నా వుద్దేశం అదికాదు, కానీ....నువ్వు ఆవిణ్ణి అక్కా అని పిలుస్తావనుకుంటాను."

ప్రసాద్ కొంచెం ఇబ్బందిగా నవ్వి—"మానేస్తానులేవోయ్, యింక అలా పిలువను" అన్నాడు.

"నీకో అక్క వుందికదా? ఆ అక్కకీ ఈ అక్కకీ తేడా ఏమిటి?"

"ఆఁ ఏముంది ఈ వరసల్లో?"

"ఏముందని అక్కవరసే పెట్టుకున్నావు?"

ప్రసాద్ చాలా వెటకారంగా నవ్వి—"లోకానికి" అన్నాడు.

"లోకాన్ని మనం మభ్యపెడితే మనల్ని లోకమూ అంతే చేస్తుందోయ్! అంత పిరికితనం ఎందుకూ? మీరిద్దరూ అక్కా తమ్ముళ్ళయితే ఎవరిక్కావాలి? బావామరదళ్ళయితే ఎవరిక్కావాలి? ఇంకోటయితే ఎవరిక్కావాలి?"

"ఎంత తేలిగ్గా చెప్పేశావు? ఎవరిక్కావాలా? అందరికీ కావాలి, ఏ మనిషి ఎక్కడ ఏం సుఖపడిపోతున్నాడో—ఎంత స్వేచ్ఛగా, ఎంత ఆనందంగా బ్రతికేస్తున్నాడో లెక్క తేలాలి. ఎవ్వరూ ఇతర్ల విషయాలు పట్టించుకోనివాళ్ళయితే లోకం ఇంత భూతంలాగా ఎందుకు కనబడుతుంది అందరికీ? నేనా వరస పెట్టుకోబట్టే మా వేపు ఎవ్వరూ కన్నెత్తి చూడ్డం లేదు. ఆవిడ భర్తకూడా డబ్బుగల బావమర్ది దొరికాడని చాలా మురుస్తున్నాడు. నేనూరికే ఏ పరిచయస్తుళ్ళాగానో—ఏ చిన్నప్పటి స్నేహితుళ్లాగానో ఏ మేనత్తకొడుకులాగానో వాళ్ళింటికి వెళ్ళొస్తూవుంటే....నువ్వన్నావేకాని లోకానికేం పడుతుందని....పిచ్చి పడుతుంది. జాతర్లలో ఎగురుతారు చూశావూ....అలాంటి పూనకం వొస్తుంది. గంగ వెర్రులెత్తి శివాలేస్తుంది. అక్క ముసుగో అన్న ముసుగో వేసుకుంటే కావలసినంత గౌరవం....రక్షణా దొరికేప్పుడు వూరికే అల్లరిపడ్డం తెలివైనపని అంటావా? ఆ గోలంతా....ఆ న్యూసెన్సంతా భరించమంటావా?"

వేణుగోపాల్ తెల్లబోయాడు.

అసలు అదికాదు. లోకం విషయం వొదిలేయ్. అసలా విణ్ణి అక్కా అని పిలవటానికి నీకెలా మనస్కరిస్తోంది? తల్లి భావం .. సోదరీ భావం పెట్టుకున్న తర్వాత ...."

"పొరపడ్డావు. నాకున్నది సోదరీభావంకాదు. వరస. ఉత్తవరస."

"అసలా వరసలోనే శరీర సంబంధాలు వూహించలేని పవిత్ర భావం జీర్ణించివుందే మనకి."

"మనకి కాదు—నీకు. ఈ అవసరాలమీదా ఈ పిలుపులమీదా నా కెప్పుడూ గౌరవం కలగలేదోయ్! అసలు తల్లీపిల్లల మధ్యగానీ... అన్నా చెల్లెళ్ళమధ్యగానీ .... భార్యా భర్తల మధ్యగానీ .... ఎంత దగ్గిర సంబంధంవున్న వ్యక్తులమధ్య అయినాసరే నువ్వనే పవిత్ర మానవత్వపు విలువలు నా కెక్కడా కనపళ్ళేదు. మా అమ్మే వుందనుకో—నన్నూ మా తమ్ముణ్ణీ దేవుళ్ళని చూసినట్టు చూస్తుంది. ఆడపిల్లల్ని పురుగులకన్నా హీనం చేస్తుంది. అందరూ కన్నబిడ్డలే అయినప్పుడు తల్లి హృదయానికి ఆ తేడా లెందుకు? ఆవిడ ప్రేమలో వుత్త లోకాచారం తప్ప నా కెక్కడా ఏ గొప్పతనమూ కనపడదు.

"సోదర ప్రేమలంటావా? 'అన్నా చెల్లెళ్ళ' సినిమాలు చూసి చెడిపోయావేమోగానీ మనుషులమధ్య అలాంటి ప్రేమ లెక్కడాలేవు. మా వూళ్ళో ఇద్దరన్నదమ్ములు—పెరట్లో వొక్క గజం చోటు కోసం తల కాయలు బద్దలుకొట్టుకుని కోర్టులకెక్కి బద్ధశత్రువులయ్యారు.

"వొక్క గజం చోటుముందు అన్నదమ్ముల ప్రేమకున్న విలువెంత. ఏ ఇద్దరి మధ్య ప్రేమ అయినా ఏదో వొక ప్రయోజనం కోసం.... ఎవరికో వొకరికి ఎక్కువ లాభం కోసం జరిగేదే! పిల్లల్ని తల్లి సమానంగా ప్రేమించదు. భార్యని భర్త నిస్వార్థంగా అభిమానించదు. డబ్బు లేని వాళ్ళని డబ్బు గలవాళ్ళు సాటి మనుషులుగా గౌరవించరు. నిత్యం ఇలాంటి వెన్నో చూస్తూకూడా ఏమిటో పవిత్రతలంటా వేమిటోయ్ వేణూ? ఏం వరసలు? ఏం విలువలు! నువ్వంత బాధపడాల్సిందేమీలేదు,

ఇవన్నీ వుత్త ఆనవాయితీలు ... ఈ పిచ్చి సెంటిమెంట్లు నాలాంటి వాళ్ళ కయినా వుపయోగపడనీ. ఈ పిలుపులు .... ముఖ్యంగా .... అన్నలూ అక్కలూ! కలకాలం ఇలాగే వర్ధిల్లుగాక." అని ముగించాడు.

వేణుగోపాల్ చాలా చలించి — ఎంత భయంకరంగా మాట్లాడు తున్నావు ప్రసాద్! మనుషుల మధ్య జరుగుతోంది డబ్బుదోపిడీ ఒకటే అనుకుంటాం. అనుబంధాలకోసం ఏర్పరుచుకున్న పిలుపుల్నికూడా.... అనుభూతుల్నికూడా ఎవరి స్వార్ధంకోసం వాళ్ళు వుపయోగించుకోవడం అన్నమాట. అంతేనా! కొన్నాళ్ళకి చంటిపిల్లల చిరునవ్వుల్తోకూడా వ్యాపారం చేసేరోజు లొస్తాయనుకుంటాను." అని విచారించాడు.

"కొన్నాళ్ళెందుకు? ఇప్పుడులేవూ! చంటి పిల్లలు దేవుళ్ళనీ—వాళ్ళ నవ్వులు పువ్వులనీ పిచ్చి పిచ్చిగా రాస్తారేగానీ, అంత నిర్మలంగా పిల్లల్ని ప్రేమించేవాళ్ళని నే నెక్కడా చూడలేదు. ఓసారి నేను రైల్లో వొస్తోంటే.. వొకావిడ పిల్లాణ్ణి బల్లమీద పడుకోబెట్టి బాత్‌రూంలో కెళ్ళింది. ఆ పిల్లాడు లేచి కాళ్ళూ చేతులా తన్నుకొని ఏడ్చి కంపార్టుమెంట్ అంతా దొర్లు తోంటే ఆడవాళ్ళూ మొగవాళ్ళూ తమకేమీ పట్టనట్టు ఊరుకున్నారేగానీ.... చంటిబిడ్డకదా అని ఎవ్వరికీ ప్రేమ రాలేదు. నేనూ వూరుకున్నాననుకో, టెర్లిన్ బట్టలు పాడౌతాయని. చివరికా పిల్లాడు బల్లమీదనించి కింద పడ్డాడు. తర్వాత ఏదో అయిందిలే. మనం ఎవరింటికైనా వెళ్తే లోపలేవీ ఇష్టం లేకపోయినా వాళ్ళ పిల్లల్ని ఎంత ప్రేమ నటిస్తూ పలకరిస్తామో ఎరగవూ? వాళ్ళ కుక్కల్నికూడా కావలించుకుని ముద్దులాడతాం. ఇప్పు డేదో మన మానవత్వం అంతా చంటిపిల్లల విషయంలో చెక్కు చెదర కుండా వున్నట్టు మాట్లాడకు. అన్ని విలువలూ వొకటే. ఏదో లాభం కనబడితేగానీ పిల్లల చిరునవ్వుకూడా ఏమీ ఆనందం కలిగించదు."

వేణు చాలాసేపు మాట్లాడలేక పోయాడు. ప్రసాద్ మాటల్లో కాదనటానికేమీ లేదు. అతను చాలా సహజంగా మనుషుల తీరుతెన్నులు కాచి వడబోసినట్టు చెప్పాడు.

—"పోనీ ప్రసాద్! మీ వరసలూ.... మీ గొడవలూ నా కనవసరం కృష్ణ సంగతి ఆలోచించు."

"కృష్ణ సంగతేమిటి!"

"ఆ అబ్బాయి ఏమన్నా అనుకోడూ మీ గురించి?"

"ఏమనుకుంటాడు?"

"చిన్నప్పుడు మనం యిలాంటివి ఏమీ అనుకోలేదా? ఆ వుత్తరాలవీ ఆ పిల్లాడితో పంపటం బాగులేదోయ్! మీ యిద్దరిమధ్యా ఇతర్లకి తెలియకూడని తప్పేదో వుంది. అతనికి స్పష్టంగా తెలుసు. మీరు లోకాన్ని ధిక్కరించి నిర్భయంగా ప్రవర్తిస్తే అది వేరే విషయం. అంతేగానీ ఇలాంటి రహస్యాల్లోకి చిన్నపిల్లల్ని లాగటం వాళ్ళ భవిష్యత్తుకి మంచిదికాదు."

ప్రసాద్ నవ్వి—"అందరి గొడవలూ ఇలా ఆలోచించి బాధపడటం నీ భవిష్యత్తుకి చాలా మంచిదన్నమాట." అని వెటకారం చేశాడు.

"మన సుఖం మాత్రమే మనం చూసుకునే భవిష్యత్తు నా కక్కర్లేదోయ్!"

లోకంలో అందరి విషయాలూ మనం ఆలోచించలేం. మన జీవితంలోకి తటస్థపడే వ్యక్తుల్ని గురించి ఆలోచించకుండా ఎలా వుండగలం?"

ప్రసాద్ పక్కసర్దుకుని పడుకుంటూ—"అతనిగొడవ నీకెందుకు వూరుకోవోయ్! అదంతా వాళ్ళమ్మకి తెలుసులే." అని నిర్లక్ష్యంగా వేణు మాటలు కొట్టిపారేశాడు.

వేణుకి చాలా కోపం వొచ్చి— "అవును. మీ అమ్మకి ఎంత తెలుసో, వాళ్ళమ్మకీ అంతే తెలుసు, పిల్లల మంచిచెడ్డలన్నీ తల్లులకి మాత్రమే తెలుస్తాయి." అని విసుక్కున్నాడు.

"లేకపోతే ఎవరింట్లో స్టూడెంట్స్ కూడా తెలుస్తాయా? ఎందుకొచ్చిన రభస. పడుకోవోయ్. ఇలాంటివన్నీ ఆలోచిస్తే పిచ్చాసుపత్రి వొక్కటే శరణ్యం మనకి."

"నీకు కాదులే. నువ్వు పిచ్చి పట్టించుకోవు. లోకానికి పట్టిస్తావు గానీ."

ప్రసాద్ నవ్వి—"అయితే నిజంగా లోకానికి సేవ చేసేది నేనే. అప్పుడైనా లోకం తన్ను తాను వుద్ధరించుకోవటం నేర్చుకుంటుంది—— ఇంక నన్ను పడుకోనియ్యి! మళ్ళీ పలకరించావంటే వూరుకోను" అంటూ దుప్పటి కప్పుకుని కళ్ళు మూసుకున్నాడు.

వేణుగోపాల్ ఉడికిపోయాడు. లోకం! లోకం! లోకం! ఇంకెక్కడుంది లోకం? తనూ, ప్రసాద్! కృష్ణా, పద్మావతీ కాకుండా యింకా ఎక్కడుంది లోకం? ఎలా వుద్ధరించాలీ లోకాన్ని? ఎవర్ని దండించాలి?

కృష్ణతో ఆ ఉత్తరాల వ్యవహారం అన్నా ఆపించాలనుకున్నాడు తను. ఆ అబ్బాయిమీద ఇతని పెత్తనం, భయపడుతూ బెదురు చూపుల్తో అతను నటిస్తూ తిరగటం....ఇక అంతే నన్నమాట.

ప్రసాద్ చక్కగా ఆలోచిస్తాడే! అతని రాజకీయాలూ——ఆ ప్రొఫెసర్లకి వంతపాడటం అంతేనేమో అనుకునేవాడు తను. అన్నీ తెలిసి—ఆలోచించగలిగికూడా దేనికీ బాధపడడేం అతను.

అప్పుడే ప్రసాద్ నిద్రలోకి జారిపోయాడు. వేణుగోపాల్ అశాంతిగా కళ్ళు మూసుకున్నాడు.

* * *

కృష్ణ వేణుకి బాగా చనువయ్యాడు. అతను వేణుగోపాల్‌ని మామయ్యగారూ' అని పిలవబోతే వేణు ఎప్పటికప్పుడే వారించి—"నన్నలా పిలవకు నా కిష్టం వుండదు. ఇద్దరు మనుషుల మధ్య ఏదో వొక బంధుత్వమే వుండాలా? మనం స్నేహితులం. వొక మనిషి ఇంకో మనిషిని బంధువుకాకపోయినా-వొక్కకులం కాకపోయినా-వొక్కదేశంకాకపోయినా ప్రేమించటం నేర్చుకోవాలి. మనం అలాగే వుందాం" అని చెప్పాడు.

"అయితే మిమ్మల్నేమని పిలవాలి?" అని అడిగాడు కృష్ణ.

పేరుతో పిలవమన్నాడు వేణు.

మొదట్లో సిగ్గుపడ్డా వేణు ఇచ్చిన చనువువల్ల....అతను కృష్ణతో

సన్నిహితంగా ప్రవర్తించే తీరువల్ల — 'వేణుగారూ!' అనటం అలవాటైంది కృష్ణకి.

కృష్ణ చదువు సంగతులుకూడా తెలుసుకుని అవసరమైతే పాఠాలో, లెక్కలో చెప్తూవుంటాడు వేణు. అతన్ని చూసినప్పుడల్లా — 'చుట్టూ ఎలాంటి హీన పరిస్థితులున్నాసరే—వాటి ప్రభావానికి లొంగని ఆలోచన నేర్వాలి.' అనుకుంటాడతను.

ఉత్త ఆలోచనలకన్న వాస్తవ పరిస్థితులకున్న శక్తి ఎంత బలమైందో తొందరగానే అర్థమైంది వేణుకి.

ప్రసాద్ పద్మావతి కోసం ఐదు రూపాయలు పంపిస్తే అందులో ఒక రూపాయ కృష్ణ దాచుకుని నాలుగురూపాయలే ఇచ్చాడని చెప్పాడు తల్లికి. ఆ సంగతి తర్వాత బయటపడి—ప్రసాద్ మండిపడుతూ "చూడు నీ శిష్యుడెంత ఘనకార్యం చేశాడో! ఇక ఇలాగే మొదలు పెడతాడు కాబోలు. కాస్త మందలించు." అని ఫిర్యాదు చేశాడు వేణుకి.

అంతా విని "మందలించాల్సింది అతన్నికాదు. అతని తప్పులకి మీరిద్దరూ శిక్ష వేసుకుంటూ వుండండి." అన్నాడు వేణు.

"చాల్లేవోయ్! నీ కబుర్లకేం?" అని విసుక్కున్నాడు ప్రసాద్.

సాయంత్రం కృష్ణ వొచ్చినప్పుడు అతని కాళ్ళమీదా, చేతులమీదా వుబ్బరించిన చారలు చూసి కంగారు పడి—"ఏమి టివన్నీ?" అని అడిగాడు వేణు.

కృష్ణ మాట్లాడలేదు. ఏడుపు మొహంపెట్టి నించున్నాడు.

వేణు వూహించాడు. ఏదో జరిగింది. ఎవరో కొట్టారు. బహుశా తల్లి....ఆ రూపాయికి?

"మరెందుకలా చేశావు?"— అనబోయి ఆగాడు. అతని చేతిమీద నెమ్మదిగా నిమిరి ఓదార్చాడు స్పర్శతో.

కృష్ణ పుస్తకాలు తెరిచి కూర్చున్నాడు. వ్రాయడానికి పెన్సిల్ తీశాడు.

'పెన్నేమైంది?' అంటే "మా మేస్టారు తీసుకున్నారు. ఇవ్వలేదు" అన్నాడు.

"ఎందు కివ్వలేదు? మర్చిపోయారేమో? మళ్ళీ అడిగావా?"

"అడిగానండీ! నాకే ఇచ్చేశా నన్నారు. నా కసలు ఇవ్వనే లేదు."

"మరి ఇవ్వలేదని చెప్పకపోయావా?"

"మీకు తెలీదండీ? తిడతారు."

'అసలు నువ్వు చెప్పింది నిజమేనా?' అనబోయి చాలా ప్రయత్నంతో ఆగాడు వేణు. అప్పుడే అతని ప్రవర్తనమీద అనుమానాలు తనకే!

"మరి మీ నాన్నకి చెప్పావా?"

"లేదండీ కేకలేస్తారు."

"ఎందుకు కేకలేస్తారు. వెళ్ళి మాష్టార్ని అడుగుతారు. లేకపోతే ఇంకో పెన్ను కొనిస్తారు?"

"మీకు తెలీదండీ, కేకలేస్తారు."

వేణుకి చాలా విషయాలు తెలీవని కృష్ణకి బాగా నమ్మకం—"మా అమ్మకి చెప్పాను. ప్రసాద్ మామయ్యగార్ని అడగమంది!"

"అడిగావా?"

మాట్లాడలేదు, ఊరుకున్నాడు. వేణు ఇక రెట్టించలేదు. మర్నాడు కొత్త పెన్ను తెచ్చిపెట్టాడు కృష్ణకి. ఆ తర్వాత కృష్ణ మరీ దగ్గిరయ్యాడు వేణుకి. తనకై తనే ఇంట్లో విషయాలన్నీ చెప్తూవుంటాడు తనకి. వాళ్ళ నాన్న ఆరోగ్యం ఎప్పుడూ బావుండదు. ఏదో చిన్న వుద్యోగం చేస్తున్నాడు. ఎప్పుడూ డబ్బులుండవు ఇంట్లో. వాళ్ళ నాన్నా అమ్మా ఎప్పుడూ పోట్లాడుకునేవారు కాదు.

ఈ మధ్యనే వాళ్ళ నాన్న అన్నిటికీ పోట్లాడుతున్నాడు. తండ్రి అంటే ఇష్టమే అయినా తల్లిమీద కృష్ణకి చాలా ప్రేమ. తల్లి చెప్పేపనులు అతను చాలా నమ్మకంగా చేస్తాడు. కృష్ణ మాటలు విన్న తర్వాత వేణు గోపాల్‌కి పద్మావతిమీద చాలా గౌరవం కలిగింది.—కొట్టినా తిట్టినాకూడా పిల్లలప్రేమకి పాత్రులయ్యే తల్లిదండ్రులు ఎప్పుడూ గొప్పవాళ్ళే.

'కృష్ణ మనసులో తల్లిమీద ఇప్పుడున్నంత ప్రేమ.... ఇంత మంచి

అభిప్రాయం ఎన్నడూ చెక్కు చెదరకుండా వుంటే ఎంత బావుండును.' అని రాసుకున్నాడు డైరీలో.

ఒకరోజు కృష్ణ దిగాలుపడుతూ ఇంట్లో పోట్లాట సంగతి చెప్పాడు. వాళ్ళ నాన్న వాళ్ళమ్మని తిట్టి అన్నం తినకుండా బయటికి వెళ్ళిపోయాడు. వాళ్ళమ్మ ఆ రోజంతా ఏడుస్తూనే వుంది. వాళ్ళింటికి ప్రసాద్ వొచ్చి వెళ్ళింతర్వాతే ఈ గొడవ జరిగింది. వేణు ఏమీ అడక్కుండానే కృష్ణ అన్నీ చెప్తాడు. అతను చెప్పింది మాత్రం శ్రద్ధగా విని అతని విచారమో, సంతోషమో పంచుకుంటాడు వేణు.

కృష్ణ మాటలవల్ల ప్రసాద్ సంగతి అతని తండ్రికి తెలిసినట్టు అర్థం అవుతోంది. చాలా ప్రమాదం. ఇంట్లో తల్లీతండ్రీ పోట్లాడుకుంటూ వుంటే.... ఆ చిన్నపిల్లల స్థితి ఎలా వుంటుందో వూహిస్తే వేణుకి చాలా ఆందోళన కలిగింది.

ప్రసాద్‌ని కొంచెం హెచ్చరిస్తే బావుంటుందా .... పిచ్చిగానీ వింటాడా? వింటాడని కాదు. కొంచెమన్నా ఆలోచించడా?.... ఎంత కాదనుకున్నా ఆ ఆలోచన వొదుల్చుకోలేకపోయాడు వేణు.

అర్ధరాత్రి ప్రసాద్ పెరటిగోడ దూకి వెనుక తలుపులు దబదబా బాదాడు. వేణు తలుపులు తియ్యటమే ఆలస్యంగా ఇంట్లోకిదూసుకొచ్చి— "ఏమిటోయ్! వొంటిగంటకే నిద్రా—నువ్వూనూ" అని విసుక్కున్నాడు.

వేణుకి నిద్రమత్తులోకూడా నవ్వొచ్చి — "నిద్ర మానేసి నన్ను కూడా గోడలూ, గొండెలూ దూకమంటావు కావున్ను"— అన్నాడు.

"నీ మొహం! నీకేం చేతనవుతుందిలే. పడుకో."

"ఇంకేం పడుకోను. అంతా చెడగొట్టావు. రేపట్నుంచీ అసలు తలుపు తియ్యను. ఏమనుకున్నావో;"

"ఏమిటివ్వాళ అంత మండిపడుతున్నావు?"—ప్రసాద్ బట్టలు మార్చుకుని మంచంమీద కూర్చున్నాడు.

"ఎప్పుడైనా అతనికి తెలిసిపోతే ఏం చేస్తావు?"

"పరుగెత్తడానికి కాళ్ళల్లో బలం వుందిలే."

"ఛః ఎంత నిర్లక్ష్యంగా మాట్లాడతావోయ్. ఎందుకీ దొంగ బ్రతుకు? నీకిదేం సుఖం? ఈ తొందర...ఈ భయం....ఏం ఆనందం నీకు?"

"నీకు తెలియదులే. ఊరుకో" అని హాస్యంలోకి దించి తప్పించుకోబోయాడు.

వేణు మండిపడి—"అవును. నా కెలాగూ తెలీదు. నే నిది ఊహించలేను. ఈ పిరికి పరుగులూ—ఈ గోడలు దూకటాలూ—ఈ దొంగ సంబంధాలూ నా కెలాగూ తెలియక్కర్లేదు—నా జీవితసర్వస్వం అనిపించే స్త్రీతో-నీ అనుభవాలకన్నా లక్షరెట్లు హాయిగా .... ఆనందంగా ఏ భయాలూ, సంకోచాలూ తెలీకుండా—ఏ వెన్నెల రాత్రుల్లోనో - ఏ ప్రశాంత ఏకాంత సమయాల్లోనో .... ఊహించు. నే నైతే అలాంటి ఔన్నత్యం నుంచి ఎన్నడూ దిగజారను—" అన్నాడు—ఆత్మ విశ్వాసం వుట్టిపడుతూ.

ప్రసాద్ హేళనగా నవ్వి—"నువ్వు చెప్పేది ఎలా వుందంటే— ఏ గంజినీళ్ళో తాగే దరిద్రుణ్ణి చూసి—ఛీ! ఛీ! ఆ గంజి ఎలా తాగుతున్నావు? అది నీకేం ఆరోగ్యం? అందులో ఏం ఆనందంవుంది? నే నైతే పంచభక్ష్య పరమాన్నాలు తప్ప ముట్టను. నే నెప్పుడూ నీ అంత నీచుణ్ణై దిగజారను—అని వెక్కిరిస్తే ఎంతసబబుగా వుంటుందో సరిగ్గా అలాగు నువ్వు చెప్పే ఆ మహాగొప్పజీవితం ఎంతమందికి సాధ్యం? ఆమె ఆ పేదరికంలో ఆ పిల్లల ఆకలి తీర్చటంకన్నా గొప్పదా నీ వెన్నెల విహారం? నువ్వేదో కలలు కంటున్నావుగానీ....అంత గొప్ప ఆడవాళ్ళని నా చిన్నప్పట్నించీ చూడలేదు. కొంచెం చదువులూ, షోకులూ పెరిగాయి, అంతే. ఇప్పుడు ఆడవాళ్ళకి నగలూ, చీరలూ చాలవు. అమెరికా ప్రయాణాలు కూడా చేయిస్తే గానీ సంతృప్తి పరచలేవు — నాసంగతంటావా? నాకు నీలాంటి ఆశలేమీ లేవు. గొప్ప ఆశలు పెట్టుకుంటే భంగపడాల్సి వొస్తుందని నా కెప్పుడూ భయమే. ఆకలితో కడుపులు మండేవాళ్ళనిచూసి జాలిపడతావు. మిగతా కోరికలు మాత్రం ఆకలిలాంటివి కావూ? నన్ను చూసికూడా జాలిపడరాదూ?" అన్నాడు.

వేణుగోపాల్ నవ్వి—"బాగున్నాయి నీ మాటలు. నిన్నుచూసి జాలి పడటమేమిటి? నీకిష్టమైన అమ్మాయిని పెళ్ళిచేసుకోరాదూ?" అనిఅడిగాడు.

ఆ రోజు ప్రసాద్‌తో తర్కించి .... బోధించి ప్రసాద్‌ని మార్చెయ్యా లనుకున్నా డతను.

"పెళ్ళా? చెప్పేశావు తేలిగ్గా. మా అమ్మకి జాతకాలు—మానాన్నకి కట్నాలు—మా చెల్లెళ్ళకి లాంచనాలు— మా చుట్టాలకి కులగోత్రాలు ఇంకా సంఘానికీ, దేవుడికీ ఏదో—ఇన్నిటి మధ్య ఇరికి పెళ్ళి చేసుకోవాలి. ఎవరైనా సరే తన పెళ్ళితో బాటు చుట్టూ ఇంతమందికి ఆనందం కలిగించాలి. ఇంక చేసుకునే వాళ్ళ యిష్టా యిష్టా లెక్కడున్నాయోయ్!

"అర్థంలేని మాటలు మాట్లాడకు. మన ఇష్టాలకి మనమే విలువ యిచ్చుకుంటే ఇవ్వన్నీ మనకి అడ్డు నిలుస్తాయా? వీటన్నిటినీ ధిక్కరించి....ఎవర్నయినా ప్రేమించి...."

"ప్రేమ అని నువ్వు దేన్ని అంటున్నావోగానీ — వీ టన్నిటినీ ధిక్కరించేంత ప్రేమ నాకెవరి మీదైనా కలుగుతోందో, లేదో, నామీద కూడా ఏ అమ్మాయికైనా అంత ప్రేమ కలుగుతుం దనుకోను. అసలు అంత గొప్ప ప్రేమలు కలగటానికి మన వ్యక్తిత్వాలూ; మన స్వభావాలూ ఏం గొప్పవని! మన ప్రేమలన్నీ డబ్బు చుట్టూనో—హోదాలచుట్టూనో—లోకాచారాల చుట్టూనో తిరిగేవేకదా ? ఆ ప్రేమలకే ముసుగులెందుకు ?

"నిన్ను నువ్వు సమర్థించుకోవటానికి మాత్రమే మాట్లాడుతున్నావు ప్రసాద్! జీవితంలో ఏది కావాలో — ఎలా కావాలో నిర్ణయించుకునే అవకాశాలు కొన్నయినా నీ కున్నాయి. ఈ నీచ వ్యభిచారమే నీకు బావుంది."

"పెళ్ళిమాత్రం వ్యభిచారం కాదేం?" అని మండిపడ్డాడు. ప్రసాద్- "మొన్న నేను సెలవుల్లో మా వూరు వెళ్ళినప్పుడు ఒక ముసలాయన కూతుర్ని తీసుకుని మా ఇంటికొచ్చాడు. నేను పెళ్ళిచూపులకి వెళ్ళమంటే వెళ్ళటంలేదని మా వాళ్ళకి నామీద చాలా పంతంగావుంది. ఆ పెళ్ళి చూపులు నాకు తెలీకుండా మా ఇంట్లోనే ఏర్పాటు చేశారు.

"ఆ అమ్మాయి కూచున్న గదిలోకి నేను వెళ్ళేలాగ నన్నేదో మభ్యపెట్టి పంపించారు. అక్కడేం జరిగినా సరే! నేనా పెళ్ళికి ఒప్పు కుంటే చాలు. అది పవిత్ర వివాహబంధం, అవునా?"

"కానీ ప్రసాద్! ఈ రోజుల్లో ఆడపిల్ల పెళ్ళి అంత భయంకర సమస్య అయిపోయింది. ఆ దృష్టితో ఎందుకు ఆలోచించవు?"

నే నొప్పుకోను. ఎంత చదువుకున్న ఆడపిల్ల లయినా ఈ రకం పెళ్ళిచూపులకి దిగజారుతున్నారు. ఆ ముసలాయన ఇంకా ఈ రోజుల్లో జాతకాలపిచ్చి పెట్టుకుని ఆ పిల్ల పెళ్ళి పెద్దసమస్య చేసుకుని ఇల్లిల్లూ తిప్పుతున్నాడు. దేశదేశాలే ఈ మహా గొడ్డు మూర్ఖత్వాలనించి బయట పడుతోంటే మనం ఇంతే. మనకన్నీ సమస్యలే. మనం మాత్రం మారం.

"ఎందుకు మారటంలేదో కూడా ఆలోచించు. ఇప్పు డొక చిన్న బిడ్డపుట్టాడంటే—అంతకుముందే ఒక సంఘం....కొన్ని నియమాలూ, ఆద ర్శాలూ స్థిరపడి వుంటాయి. అవే నమ్మి వాటిమధ్యే ఆ బిడ్డ పెరిగి పెద్దవా డవుతాడు. మనుషులంతా అలా పెరిగేవాళ్ళే-స్వతంత్రాలోచన వున్నవాళ్ళు సంఘప్రభావానికి పూర్తిగా దాసులుకాకుండా, బలహీనులు కాకుండా ఏది ఎంత అవసరమో గ్రహించగలిగేవాళ్ళు మనుషుల మంచికోసం, సుఖం కోసం ఏవో కొత్తమార్పులు చెయ్యాలని కోరేవాళ్ళు .... జీవితాలకు జీవితాంతం త్యాగంచేస్తారు. మనం పైపై పరిస్థితులుచూసి విసుక్కుంటాం వాటికి కారణాలు తరిచిచూస్తే మనకొచ్చే సమస్యలన్నీ మన సాంఘిక వ్యవస్థలవల్ల వొచ్చే అనర్థాలేకదా? అవేవో ఒక్క మనిషికి సంబం ధించిన వ్యవహారంగా మాట్లాడుతున్నావు. విప్లవాలు జరిగి-రక్తపుటేర్లు ప్రవహించి ప్రభుత్వాలు మారి, ఇజాలూ, రాజ్యాలూ తల్లక్రిందులైతేగాని జరగని విషయాన్ని వూరికే మనం ఎందుకు మారం? అంటున్నావు. నీకు నచ్చని పద్ధతుల్ని ఎంతో ఆలోచిస్తున్నావు. విమర్శిస్తున్నావు. నీకు నచ్చే విధంగా చేసుకోవాలని ఎందుకు పట్టుదలలేదు? ఒక ఔన్నత్యానికో ఆదర్శానికో కట్టుబడి నీ జీవితంలో ఓ చిన్నమార్పు సాధించి చూపించ రాదూ?"

"నేనంత తెలివి తక్కువ వాణ్ణి కానోయ్! సంఘం పిచ్చికుక్క లాంటిది. దాన్ని తప్పించుకుపోతూ వుండాలేగానీ .... ఎదురు తిరిగి దాంతో పోట్లాడితే మనల్ని కరిచి కరిచి మనక్కూడా పిచ్చెక్కిస్తుంది. నాకూ పునర్జన్మల మీద నమ్మకంలేదు. లేకపోతే ఈ జన్మ ఏ మంచి పనికో బలిచేసి వుందును. ఈ మనుషుల్ని మార్చటానికి ఎన్నికోట్ల ఆదర్శాలు-ఎన్ని త్యాగాలు అవసరమో మనం వూహించలేము."

"మనం మారి కదా ఇతరుల్ని విమర్శించాల్సింది."

"సరే! మారదాం రేపు. పడుకోవోయ్. నిద్రొస్తోంది. నీ నీతి బోధతో చంపకు."

ప్రసాద్ మీద వేణు కేమీ దురభిప్రాయం కలగలేదు. లోకంలో అందరూ ఎలా బ్రతికితే నెట్టుకురాగలరో – అతనూ అలాగే బ్రతుకు తున్నాడు. తనూ అలా బ్రతుకుతోన్నవాడే.

*  *  *

కృష్ణ సంతోషంగా వున్నాడండే వాళ్ళమ్మ సంతోషంగా వుందని అర్థం. అతను దిగులుగా వున్నాడంటే వాళ్ళింట్లో ఏవో చికాకులూ— పోట్లాటలూ జరుగుతున్నాయని అర్థం.

కృష్ణ నాలుగైదు రోజుల్నుంచీ చాలా విచారంగా కనబడు తున్నాడు. ప్రసాద్ కోసం రోజుకి నాలుగైదు సార్లు వొచ్చి అడుగు తున్నాడు. ప్రసాద్ ఎక్కడికి వెళ్ళాడోగానీ రూంకే రావటంలేదు.

"డబ్బేమైనా కావాలా?" అని వేణు అడిగితే—"కాదు. మామయ్యా గార్ని మా అమ్మ తప్పకుండా తీసుకురమ్మంది" అన్నాడు, చాలా నిరాశపడుతూ.

ఆ సాయంత్రం కృష్ణ వేణుకో వుత్తరం తెచ్చి యిచ్చాడు. పద్మావతి నమస్కారాలతో, కన్నీళ్ళతో ఆ వుత్తరం రాసింది వేణుకే. ఆమెకి మూడోనెల. అది భర్తకి తెలీకూడని విషయం. ఎలాగైనా ప్రసాద్‌ని పంపించమని ప్రార్థన అది. తమ రహస్యం వేణుకి తెలిసిందే కాబట్టి ఆమె అంత ధైర్యంచేసింది.

వేణు కేం చెయ్యాలో తోచలేదు. ప్రసాద్ కోసం తిరిగాడు. అత నెక్కడా దొరక్క రాత్రి రూం కొచ్చేసరికి—ప్రసాద్ రూమ్‌లో బట్టలు సర్దుకుంటున్నాడు హడావుడిగా.

"ఎక్కడికెళ్తున్నావు?" అన్నాడు వేణు.

కంగారుపడి "పనుంది వెళ్ళాలి."

"ఇప్పుడా? ఈ వుత్తరం చూడు" అని పద్మావతి ఉత్తరం చూపించాడు. ప్రసాద్ అది చదివి చింపేశాడు. పర్స్‌లోంచి వంద రూపాయలు లెక్కపెట్టి టేబుల్‌మీద పెట్టాడు.-"కొంచెం నువ్వెళ్ళి ఇచ్చెయ్యవోయ్! ఆ కృష్ణచేతి కివ్వకు. వాడు సగం కొట్టేస్తాడు" అని మళ్ళీ బట్టలు సర్దటంలో పడ్డాడు.

వేణు తెల్లబోయి – "అసలు ఇంత అర్జంటుగా నీ ప్రయాణం ఎక్కడికి? పాపం ఆవిడ ఎంతో భయపడుతూ రాసింది. ఒక్కసారి వెళ్ళి మాట్లాడరాదూ? నీ సహాయం ఏమైనా కావాలేమో!" అన్నాడు.

"అబ్బే! నాకు వీలుకాదోయ్! నన్నేం చెయ్యమంటావు? ఇలాంటి వన్నీ ఆవిడ ఆలోచించుకోవాలి. నన్నడిగితే నేనేం చెప్పను?" అని విసుక్కున్నాడు ప్రసాద్.

మొదట్లో అతను ఆమె కోసం ఎంత తాపత్రయపడి తిరిగాడో.... ఆమె నిజంగా జడిసినప్పుడు ఎంత ధైర్యం చెప్పాడో – ఆమె మంచి చెడ్డల వూగిసలాటతో సందేహించినప్పుడు ఎంత ప్రాధేయపడ్డాడో...అతని కిప్పుడేమీ జ్ఞాపకం లేదు. ఆస్పత్రులూ—డాక్టర్లూ—ఆమె కోసం తను నవ్వుల పాలు కావటం అతని కేమీ ఇష్టంలేదు.

పెట్టిమూసి వేణుగోపాల్‌ని చూస్తూ "వోసీ నువ్వే చెప్పు. నా వొక్కడిదేనా తప్పు?" అని తన నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకోబోయాడు.

వేణు ఆశ్చర్యపడి- "ఇప్పుడు తప్పు సంగతెందుకు? తప్పొప్పు లెవరు నిర్ణయిస్తారు. అసలిది తప్పు కాదని నువ్వే వాదించావు. జ్ఞాపకం వుందా? మనం వొక పరిస్థితి కల్పించుకున్న తర్వాత వచ్చే ఫలితాలుకూడా

అనుభవించాలి కదా? ఆవిడకి సహాయం చెయ్యాల్సిన బాధ్యతేమీ లేదా నీకు?" అని అడిగాడు.

"అందుకే కదోయ్ డబ్బిచ్చింది?"

"డబ్బేనా ఆవి డడిగింది? - డబ్బుతో మనుషుల్ని కొనా లను కుంటున్నావు."

"నీకు తెలీదులే. మనుషులేంవిటి? దేవుణ్ణే కొంటున్నారు."

"ఆవిడ డబ్బు తీసుకోదు."

"అతని కియ్యి. మహా ప్రసాదంగా తీసుకుంటాడు."

"ప్రసాద్! మనుషుల్ని నువ్వెందు కింత తక్కువ అంచనా వేస్తున్నావు?"

ప్రసాద్ మాట్లాడలేదు. మళ్ళీ పెట్టితీసి ఏవో సర్దుతూ నించున్నాడు.

వేణుగోపాల్ సాధ్యమైనంత అనునయంగా అన్నాడు-"ప్రసాద్! కొన్ని రోజులైనా ఆవిడతో నువ్వు ఆనందపడ్డావు. అందుకైనా కృతజ్ఞత లేదా? కనీసం.... జాలి కలగటం లేదా?....వొక్కసారి న్యాయంగా ఆలో చించు. నిజంగా నీకు మనసే వుంటే...."

ప్రసాద్ అడ్డుపడి నెమ్మదిగా "ఇన్నాళ్ళూ నేనూ లే దనుకున్నాను గానీ.... నా క్కూడా మనసుందేమో అని భయంవేస్తోంది వేణూ! ఏ అర్ధ రాత్రో ఆవిడ వొచ్చి ఏడిస్తే....అదేం కుదరదోయ్! అర్జంటుగా వెళ్ళాలి" తొందరపడ్డాడు.

వేణు మాట్లాడలేదు.

పదినిమిషాల్లో ప్రసాద్ సూట్‌కేస్ పట్టుకుని వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిన వెంటనే కృష్ణ మళ్ళీ వచ్చి — "మామయ్య గారొచ్చా రాండీ!" అని అడిగాడు.

పదిగంటలరాత్రి వేణుకేం చెప్పాలో తోచక — "అమ్మకి వొంట్లో ఎలా వుంది?" అన్నాడు.

"పడుకుని ఏడుస్తోందండీ!" అన్నాడు ఏడుపు మొహంతో.

"నాన్నగా రున్నారా?"

"లేరండీ! ఇప్పుడే డ్యూటీకి వెళ్ళారు. మామయ్యగా రెప్పు దొస్తారండీ!"

"నేనొస్తున్నాను పద," అని వేణు తన దగ్గిర డబ్బు కొంత తీసి ప్రసాద్ ఇచ్చిన డబ్బుతో పాంటుజేబులో పెట్టుకున్నాడు. "వేణు వొస్తా ననగానే కృష్ణ మొహం వికసించింది. "మీరొస్తారా? మా యింటికా?" అంటూ ఆనందంగా చూశాడు.

వేణు కృష్ణ చెయ్యి పట్టుకుని నడిచాడు.

"అమ్మా! వేణుగా రొచ్చారు" అని కృష్ణ సంబరంగా చెప్పాడు.

పద్మావతి కంగారుపడుతూ మధ్య గుమ్మంవరకూ వొచ్చి కొంచెం తలవంచుకుని నిలుచుంది. రెండే గదులు; చాలా చిన్నవి. ఇరుకు. గడప దగ్గిర ముక్కాలపీట మీద కిరసనాయిలు దీపం వెలుగుతోంది. కృష్ణ వొత్తి పెద్దది చేశాడు. గదుల్లో సామానులు కొంచెం వివరంగా కనపడ్డాయి. చిన్న పిల్లలిద్దరూ చాపమీద పడుకుని నిద్రపోతున్నారు.

"కూర్చోండి!" అని కృష్ణ ఎత్తుపీట తెచ్చివేశాడు. వేణు కూర్చో లేదు. జేబులోంచి డబ్బుతీసి ఆ పీటమీద పెట్టాడు.

—"మీ కిమ్మని ప్రసాద్ ఇచ్చాడండీ!" అన్నాడు.

"డబ్బా? ఎందుకూ?" అని తెల్లబోయిందామె.

"ఆయనెందుకు రాలేదూ?" అని ఆందోళనంగా అడిగింది.

"అతన కేదో అర్జంటు పని వొచ్చిం దన్నాడు. ఇంటి దగ్గిర ఎవ రికో బాగాలేదని ఉత్తరం వొచ్చినట్టుంది, ఈ డబ్బు మీ కిమ్మని...."

"నాకు వొక్కసారి చెప్పి వెళ్ళవచ్చునే?" చాలా నెమ్మదిగా దిగులుగా అంది.

"అవును. కానీ.... అతను...."

"రెండు వారాలనించీ ఆయన నాకు కనిపించలేదండీ! ఎన్నిసార్లో కబురంపాను. ఎంత చిత్రంగా మారిపోయా రాయన?" అంది. దాదాపు కంఠం దుఃఖంతో ఆగిపోయింది. ఆ కంఠం నిండా కోపం కూడా ధ్వనించింది

"కాదండీ! అతను మీ మీద చాలా ప్రేమగా మాట్లాడాడు నాతో మీరు బాధపడవద్దు. తొందరగా వొచ్చేస్తా దనుకుంటాను?''

"మీకు తెలీదు" కటువుగా మందలించినట్టు అని—గుమ్మానికి తల ఆన్చుకుంది. నిశ్చబ్ధంగా ఏడుస్తూ నిలబడింది.

వేణు భరించలేక 'మీరేం బాధపడకండి అక్కయ్యగారూ!' అన బోయి చాలా ప్రయత్నంమీద ఆగాడు....వొద్దు ఆ పిలుపు....దాని పవిత్ర తంతా పోయింది. ఆమె నమ్మదు. తనని కూడా ఇంకో ప్రసాద్ అను కుంటుంది.

"మా అమ్మకోసం మీరేమీ చెయ్యలేరా?" అన్నట్టు చూస్తూ దిగాలు పడి నించున్నాడు కృష్ణ. ఆమె దుఃఖం నిగ్రహించుకోవాలని నిశ్శబ్దంగా విశ్వప్రయత్నం చేస్తోంది. కానీ చెంపలమీద కన్నీళ్ళు మాత్రం ఆ లేత వెలుగులో వర్షాకాలపు నదిలాగ మహావేగంగా దారలుకట్టి జారుతూ మెరు స్తున్నాయి. ఇంత ఆవేదన – ఇంత దుఃఖం ఎప్పటికి వుపశమిస్తుంది? ఎవరు ఓదార్చగలరు?

ఆమెకి చాలా సన్నిహితుడై ఆమె కష్టం పంచుకోవాలనే వాత్స ల్యంతో తలమున్కలై ఇంకా వొక్క అడుగు ముందుకువేసి "మీరేం బాధ పడకండి అక్కయ్యగారూ!'' అన్నాడెంతో అప్రయత్నంగా.

మరుక్షణంలో అతని చెంప ఛెళ్ళుమంది. ఆమె మండిపడి బుసలు కొడుతూ "వెళ్ళవతలకి-ఎవ్వరికి తమ్ముడివి నువ్వు! సిగ్గులేదా మీ బ్రతు కులకు? ముందు కదులు ఇంట్లోంచి" అని అరిచింది.

వేణు వొక్క అంగుళంకూడా కదలలేదు. అతను చాలా సేపు తల వొంచుకుని నించున్నాడు. కొంతసేపటికి తలెత్తి పద్మావతిని గౌరవంగా చూస్తూ-"మీ కెప్పుడైనా అవసరమైతే నా దగ్గిరికి కృష్ణని పంపించండి అక్కయ్యగారూ! నేను మీ కెలాంటి తమ్ముణ్ణో నాకూ తెలీదు. కానీ మీకేం సహాయం కావాలన్నా చేస్తాను. ఏ డాక్టర్ దగ్గిరికైనా తీసికెళ్ళ మంటే తీసికెళ్తాను. ఎవర్నయినా ఇంటికి తీసుకురమ్మంటే తీసుకొస్తాను.

నన్ను నమ్మండి అక్కయ్యగారూ! నాకు చెప్పటానికి మీరేమీ సందే హించవద్దు"అని ఎప్పట్లాగే నించున్నాడు. పద్మావతి తెల్లబోయి మాట్లాడ లేకపోయింది.

"మీకు చెప్పదగ్గవాణ్ణి కాదు కానీ .... ధైర్యంగా వుండండి అక్కయ్యగారో!" వేణు గుమ్మంవేపు నడిచాడు.

పద్మావతి దుఃఖం ఆపుకుని —"ఆ డబ్బు నాకక్కర్లేదు? తీసికెళ్ళి ఆయనకే పంపించెయ్యండి. అంది కోపంగా.

వేణు వెనక్కి తిరిగి ఆమెని చూశాడు. రెండు నిమిషాలు నించు న్నాడు. డబ్బుతీసి జేబులో పెట్టుకున్నాడు.

పద్మావతి స్వరమంతా కృతజ్ఞతతో నిండింది- "నేనీ దరిద్రంతో డబ్బుకి వొళ్ళమ్ముకున్న మాట నిజమే? మనసుకూడా అమ్ముకున్నా ననుకోకండీ'' ఆ రెండుమాటలూ అతనితో అనాలని ఆమె ఆతృతపడింది.

వేణు వినయంగా విన్నాడు.

కొంతసేపు నిలబడి బయటికి వచ్చాడు. కృష్ణకూడా అతని వెన కాల వొచ్చాడు.

"మా అమ్మ మిమ్మల్ని కొట్టిం దెందుకండి?'' అన్నాడు ఆశ్చర్య పడుతూ?

"పాపం అమ్మ మనసేం బాగాలేదోయ్....కృష్ణా! నువ్వు అమ్మతో ఎప్పుడూ ప్రేమగా ఉండాలి. ఏం?''

కృష్ణ కళ్ళెత్తి చూశాడు చాలా నిర్మలంగా. వేణు ఆరాత్రి ఇలా రాసుకున్నాడు డైరీలో — పద్మావతి ఎంత ఆత్మాభిమానం గలవ్యక్తి! కానీ....ఆమెనికూడా పతనం చేసేంత హీన పరిస్థితులు. రేపు ఇవన్నీ ఆలోచిస్తాడా కృష్ణ! అతను పెద్దవాడై లోక మర్యాదలకి లొంగి తల్లి నీతి బాహ్యరాలని అసహ్యించుకుంటాడేమో....!

(28—7—72 ఆంధ్రజ్యోతి వారపత్రిక నించి)